ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 9 సెప్టెంబరు 2025

మానేరు వద్ద రోడ్డుపై గుంత

త్వరితగతిన పూడ్చిన అధికారులు



ఎక్స్‌కావేటర్‌తో పూడ్చిన గుంత

గంభీరావుపేట, సెప్టెంబరు 8 ఆంధ్ర జ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద రోడ్డుపై గుంత ఏర్పడింది. అటుగా వెళుతున్న ప్రజలు అధికారులకు సమాచారం అందించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. లింగన్నపేట వాగు రోడ్డు తెగిపోవడంతో సిద్దిపేట- కామారెడ్డికి ఈ మార్గమే ప్రధానమైంది. దీంతో వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉండంటతో అధికారులు త్వరతగతిన మరమ్మతులు చేయించారు. మరమ్మతులు చేయించే వరకు ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. మరమ్మతులు పూర్తి కాగానే తిరిగి వాహణాలను నడిపించారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి : మండలం కేంద్రం నుంచి కొదురుపాక వెళ్లే ప్రధాన రహదారి దేశాయిపల్లి వరద కాలువ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతినటంతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం గుంతల్లో మట్టి పోయించి ప్రయాణికుల ఇబ్బందులు లేకుండా చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్డును శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచన మేరకు అధికారులు బీటీ రోడ్డు నిర్మాణానికి 35 లక్షల అంచనాలను రూపొందించారన్నారు.ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్, మాజీ సర్పంచ్ మడిశెట్టి జనార్దన్, సురేందర్‌రెడ్డి, మధుకర్ ఉన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ

- జీపీవోల నియామకంతో సేవల పునరుద్ధరణ
- జిల్లాలో 118 క్లస్టర్లు ఏర్పాటు
- విధుల్లో చేరిన గ్రామ పరిపాలన అధికారులు
- జిల్లాలో 260 గ్రామాల్లో అందుబాటులోకి సేవలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

దాదాపు నాలుగేళ్ల క్రితం గ్రామాల్లో దూరమైన రెవెన్యూ సేవలు మళ్లీ మొదలయ్యాయి. గత ప్రభుత్వం గ్రామాల్లో రద్దుచేసిన రెవెన్యూ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల మంది గ్రావపరిపాలన అధికారులు జీపీవోలకు హైదరాబాదులో నియామక పత్రాలు అందజేయగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా క్లస్టర్ గ్రామ పంచాయతీల కేటాయిస్తూ నియామక పత్రాలు అందించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీలు ఉండగా 118క్లస్టర్లుగా ఏర్పాటుచేసి జీపీవోలను నియమించారు. వీఆర్‌ఏ, వీఆర్వోల నుంచి అర్హతలు ఉన్న వారిని రాతపరీక్ష ద్వారా 66మంది జీపీవోలుగా ఎంపిక కాగా మిగతా జూనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి జీపీవోలుగా నియమించారు. దీంతో భూభారతి పోర్టల్, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఫిర్యాదులు వేగంగా పరిష్కారం కానున్నాయి.

వీఆర్‌ఏ, వీఆర్వో వ్యవస్థ లేక ఇబ్బందులే

గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ సేవలు కోసం 2007 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వీఆర్‌ఏ, వీఆర్వో వ్యవస్థను తీసుకొచ్చారు. వీఆర్‌ఏ, వీఆర్వో వ్యవస్థపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో 2001లో బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటినుంచి సర్వీస్ కోల్పోయి కేడర్ తగ్గించుకొని వివిధ శాఖల్లో వీఆర్వో, వీఆర్‌ఏలు చాలా ఇబ్బందులు పడుతూ పని చేశారు. అప్పట్లో కొన్ని నెలలపాటు సర్దుబాటు కూడా చేయకపోవడంతో ఏం చేస్తారో తెలియక అవసలు పడ్డారు. గత ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలుమార్లు వీఆర్ఏ, వీఆర్వోలు తమను మాతృ సంస్థకు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. గతంలో రెవెన్యూ రికార్డులు నిర్వహించిన వీఆర్వో, వీఆర్ఏలు లేకపోవడంతో భూమి వివాదాల..

మిగతా 8లో



కలెక్టర్ ఆధ్వర్యంలో జీపీవోలకు నియామక పత్రాల పంపిణీ

పోలీస్‌శాఖపై నమ్మకం కలిగేలా గ్రీవెన్స్ డే : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖపై నమ్మకం కలిగేలా గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 23 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. అర్జిదారులనుండి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కారించాలని ఆదేశించామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందు పరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజల కు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.

ఏఎన్‌ఎంల పనిభారాన్ని తగ్గించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం పనిభారం తగ్గించడంతో పాటు ఆన్‌లైన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఏఐటీయూసీ జిల్లా కమిటీ పిలుపు మేరకు జిల్లాలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు తరలివచ్చి కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేసి కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఏఎన్‌ఎంలను అధికారులు అనేక రకాలుగా అప్‌లతో పాటు ఆన్‌లైన్‌లలో, డ్యూటీలతో పది నుంచి 12 గంటల వరకు పనిచేయిస్తున్నారన్నారు. పనిభారం పెరిగిపోవడంతో ఏఎన్‌ఎంలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఏఎన్‌ఎంలకు పనిభారం తగ్గించాలని కోరారు. ఈ ధర్నాలో ఇందిర, అరుణ, వనజ, వసంత, స్వన్నదేవి, అనిత; సంతోషశ్రావణి, స్వరూప, మమతా, రజిత, కవిత, మమతా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీల విజేతలకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలని అన్నారు. అన్ని రంగాల్లో క్రీడాకారులకు ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలను కల్పిస్తోందని అన్నారు. అనంతరం బహుమతును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో కృష్ణహరి, ఎస్ఐ రాహుల్ రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ కల్పించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు



కలెక్టరేట్ ఎదుట దీక్షలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు డిమాండ్ చేశారు. సిరిసిల్లజిల్లా కలెక్టరేట్ ఎదుట జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోని బీసీ సంఘాల నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. బీసీ ఉద్యమం ఎవరికీ వ్యతిరేకం కాదని కేవలం సమాజ అభివృద్ధికి , సమాన అవకాశాలను సాధించుకునేందుకు పోరాడుతున్నామన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడేందుకు నిర్వహించిన శాంతియుత కార్యక్రమమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల బీసీలు కలిసి సమాజానికి సరైన మార్గాన్ని చూపించాలన్నారు. కార్యక్రమంలో అన్నిరంగాల నాయకులు పాల్గొన్నారు.

రేపు స్థానిక సంస్థల తుది ఓటరు జాబితా

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఓటర్ల తుది జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా సెప్టెంబరు 10న ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రకటించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం గ్రామపంచాయతీ ఓటర్ లిస్ట్, పోలింగ్ కేంద్రాల లిస్టులపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎన్నికల నిర్వహణకు డ్రాఫ్ట్ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను విడుదల చేయడం జరిగిందన్నారు. 650మంది ఓటర్లకు ఒకపోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 123 ఎంపీటీసీ, 12 జడ్పీటీసీ స్థానాలకు స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయని వీటి పరిధిలో 3లక్షల 53వేల 351 ఓటర్లు ఉన్నారని 278 లోకేషన్స్‌లో 712 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక మేజర్ గ్రామపంచాయతీ రెండు ఎంపీటీసీ స్థానాల పరిధిలో ఉంటే ఒక కుటుంబంలోని సభ్యులందరూ ఒకే ఎంపీటీసీ స్థానంలో ఓటర్లుగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేస్తే 9వ తేదీన అభ్యంతరాలను పరిష్కరించి 10వ తేదీన తుది ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో వినోద్‌కుమార్, రాజకీయ పార్టీలకు చెందిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, తెలుగు దేశం పార్టీ నాయకులు తీగలశేఖర్‌గౌడ్, తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజబీంకార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

చిన్నారి శస్త్ర చికిత్సకు చేయూత

సిరిసిల్ల కలెక్టరేట్ : చిన్నారి శస్త్ర చికిత్సకు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా చేయూత అందించారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి భాగ్య కుతురుకు వెన్నెముకకు సంబంధించిన సమస్యతో బాధపడుతుండగా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో భాగ్య తన కూతురితో వచ్చి జిల్లా కలెక్టర్‌ను కలిసి వైద్యం చేయించుకునేందుకు అర్థిక సహాయం చేయాలని కోరడంతో స్పందించిన కలెక్టర్ చిన్నారి శస్త్ర చికిత్స కోసం రూ.74వేల 938 అర్థిక సహాయం చెక్కును భాగ్యకు అందించారు. దీంతో అర్థిక సాయం అందించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కస్తూర్బా పాఠశాల తనిఖీ

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ రూమ్, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆర్‌వో ప్లాంట్ వినియోగంలో ఉందా అని ఆరా తీశారు. తరగతి గదుల్లో బోధన కొనసాగుతుండగా పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయలు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. సీఈసీ విద్యార్థులకు ఎకనామిక్స్ పాఠాలు బోధించి. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాల ఆవరణలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి సమీర్‌ను ఆదేశించారు. కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి శ్యామల ఉన్నారు.

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి

ముస్తాబాద్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : అసైన్డ్ భూములకు యజమాన్య హక్కులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూమలకు యజమాన్య హక్కులు కల్పించి ఆ భూములకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుపేదలకు, దళితులకు చెందాల్సిన భూమి వారికి అందించాలన్నారు. రాజకీయ నాయకులు వేలాది ఎకరాలను పట్టాలు చేసుకున్నారని పేదలకు భూములు పంచాలని గుంటి వేణు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు బాల ఎల్లయ్య కుటుంబానికి స్థానిక జామ మజీద్ కమిటీ సభ్యులు సోమవారం రూ.7 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఇర్ఫాన్‌హుస్సేన్, సాహెబ్, అశ్వక్, జాకీర్ హుస్సేన్, గౌస్, అజిత్, అజిమోద్దిన్, బాబు, అప్సనా, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఎరువుల కొరత

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఎప్పుడూ లేని ఎరువుల కొరత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు వచ్చిందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆరోపించారు. వేములవాడ పట్టణం లోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు., రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఎరువులను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. యూరియా విషయంలో సీఎం, మంత్రులు మాట్లాడే మాటల్లో తేడాలు ఉండటంతో వాళ్లకే ఒక అవగాహన లేదని అర్థమవుతుందని విమర్శించారు. యూరియా కొరత అనేది స్థానిక ఎమ్మెల్యే స్వగ్రామం రుద్రంగి నుంచి ప్రారంభమైందని అన్నారు. ఇప్పటికీ యూరియా కొరత అలాగే కొనసాగుతుందంటే కాంగ్రెస్ పార్టీ పుణ్యమేనని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల జిల్లా కో ఆపరేటివ్ సొసైటీలో ఉన్న రైతులకు బీఆర్ఎస్ నాయకులు అండగా ఉంటే 8 మంది నాయకులపై కేసులు పెట్టడం హేయమైన చర్య అన్నారు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కువగా యూరియా కొరత సిరిసిల్ల జిల్లాలోనే ఉదని, 6వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటికి సరఫరా చేయాల్సి ఉందని అన్నారు. రైతులు యూరియాకోసం అడిగితే కేసులు పెడుతు న్నారని అన్నారు. గడిచిన 21నెలలుగా ఏం చేశారో సమాధానం చెప్పాలని అన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్‌లో సేకరించిన భూమిలో మీరు అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. వచ్చేది సమ్మక్కజాతర అని అలాంటి సమ యంలో దసరా తర్వాత గుడిచెరువు పనులు ప్రారంభిస్తామని అంటున్నా రని అన్నారు. ఇన్నేళ్లలో లేని తొందర ఇప్పుడు ఎందుకని ప్రశ్నిం చారు. ఫిబ్రవరి తరువాత అభివృద్ధి పనులు ప్రారం భించాలని సూచించారు. కాళేశ్వరం అంటే కాంగ్రెస్ నాయకులకు తెలియడం లేదని, లక్ష కోట్లు అవినీతి అంటున్నారు అంటే వారికి అవగహనలేదని స్పష్టంగా అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అంటే ఒక సుందిళ్ల, అన్నారం, మల్కపేటకూడా అందులో భాగమేనని అది తెలుసుకోకపోవడం దురదుష్టకరమని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో ఒక లక్షకు పైగా ఎకరాలు పారాలంటే రూ. 4 వేల కోట్లపైన ఖర్చు పెట్టాల్సి వస్తుందని అన్నారు. హైదరాబాద్‌కు తీసుకువెళుతానని చెప్పిన నీరు కూడా గోదావరి జలాలేనని కాంగ్రెస్ నేతలు గ్రహించాలని హితవు పలికారు. వేములవాడ నియోజకవర్గానికి వేలకోట్ల నిధులు తీసుకువ చ్చానని, ప్రజలను మభ్యపెడుతున్నారని, వేలకోట్ల నిధులు తీసుకువ చ్చింది నిజమే అయితే శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. రాజన్న ఆలయాన్ని ఎన్నిదశల్లో, ఎంతసమయంలో అభివృద్ధిచేస్తారో వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, నాయకులు తీగల రవీందర్ గౌడ్, రామతీర్థపు రాజు, నరాల శేఖర్, నీలం శేఖర్, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, కందుల క్రాంతి కుమార్, వాసాల శ్రీనివాస్, నీరటి మల్లేశం, మహేష్, శంకర్, ముత్త మహేష్, జడల చిన్న శ్రీనివాస్, గొస్కుల రవి, యామ తిరుపతి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

పీహెచ్‌డీ పట్టా పొందిన యువకుడికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పీహెచ్‌డీ పట్టా పొందిన యువకుడు ఎనగందుల శ్రీనును ప్యాక్స్ చైర్మన్, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి , స్థానికులు సోమవారం ఘనంగా సన్మానించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన శ్రీను ఎన్నో కష్టాలను అధిగమించి డాక్టరేటు పట్టా సాధించడం అభినందనీయమని అన్నారు. యువత శ్రీను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింలు, శ్రీనివాస్, ఎల్లారెడ్డి, హసన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందించాలి

- కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచి అన్ని వర్గాల ప్రజలకు అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నడిమెల శోభారాణిలు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితిల అధ్వర్యంలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలందరు తరలివచ్చిన జిల్లా కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి పెన్షన్ దారులు, వృద్దులు, వితంతువులు, వికలాంగులు, బీడి కార్మికులకు, నేత, గీత కార్మికులతో పాటు కండరాల క్షీణత, బోధకాలు బాధితులు, ఎయిడ్స్ రోగులకు రూ 4వేలు, 4వేలు ఉన్నవారికి రూ 6వేలు ఇస్తామని ప్రకటించడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు వాటిని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర సీఎం స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలు అదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అవునూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద దర్నా చేస్తున్న ఎమార్పీఎస్ నాయకులు, ప్రజలు

రూ.7450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 12క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠధర రూ.7450 చెల్లించి పత్తికొనుగోళ్లు చేపట్టారు.

వ్యవసాయ మోటార్ల సర్వీసు వైర్లు చోరీ

గంగాధర, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో 15 మంది రైతుల వ్యవసాయ మోటర్ల విద్యుత్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రైతులు సోమవారం ఉదయం నీరు పెట్టడానికి పొలం వద్దకు వెళ్లారు. వ్యవసాయమోటర్లకు స్టార్టర్ల నుంచి విద్యుత్‌వైర్ కత్తిరించి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన 15మంది రైతుల బోర్లు, బావులు, కాలువ నుంచి సాగునీరందించే మోటార్ల వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లారని రైతులు వాపోయారు. ఎత్తుకెళ్లిన కేబుల్స్‌ను కాల్చి రాగి తీగలను అమ్ముకుంటారని రైతులు తెలిపారు. గతంలో కూడా గ్రామానికి చెందిన పలువురి మోటర్లతోపాటు విద్యుత్‌తీగలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ దొంగలను గుర్తించలేదని రైతులు వాపోయారు. దొంగల బాధ నుంచి తమ మోటార్లను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

దాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష


బుగ్గారం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని యశ్వంతరావుపేటకు గ్రామానికి చెందిన నక్క పరమేశ్వర్ అనే మేస్త్రీపై దాడి చేసిన గజ్జల నరేష్‌కు ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ యేగి జానకి సంవత్సరం జైలుశిక్ష, 1000 రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. నరేష్ తన ఇంటి స్లాబ్ నిర్మాణం కోసం పరమేశ్వర్‌తో 20వేల రూపాయలకు ఒప్పందం చేసుకోవడంతో పని పూర్తిచేశాడు. అనంతరం నరేష్ డబ్బులు ఇవ్వకపోగా పరమేశ్వర్‌పై 2021 ఆగస్టు 17రోజు తలపై దాడిచేశాడు. దీంతో పరమేశ్వర్ బుగ్గారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా అప్పటిఎస్సై ఉపేంద్రచారి కేసు నమోదు చేసి నరేష్‌ను కోర్టులో హాజరు పరిచాడు. సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి నిందితుడికి జైలుశిక్ష జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామశివారులోని రైస్‌మిల్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఒకరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన గొల్లపల్లి తరుణ్ తన స్నేహితుడు అరవింద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి వరంగల్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్ శివారులోని రైస్‌మిల్ వద్ద వాహనం అదుపుతప్పి కింద పడడంతో తరుణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్నేహితుడు అరవింద్ వెంటనే అతన్ని 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించాడు.

మహనీయుడి పేరుతో.. మన భాషా దినోత్సవం

- నేడు కాళోజీ జయంతి
- తెలంగాణ భాషా దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకనీది.. చావునీది.. బతుకంతా దేశానిది.. దోపిడీ చేసే ప్రాంతేతరుడిని దూరంగా తన్ని తరుముదాం.. ప్రాంతంవాడే అయితే ప్రాణంతోనే ఇక్కడే పాతి పెడదాం.. అంటూ నినదించిన ప్రజాకవి కాళోజీ. తన గొడవనే ప్రజా గొడవగా మలచి విలక్షణ అక్షర యోధుడిగా, మానవతా వాదిగా కనిపిస్తారు కాళోజీ నారాయణరావు. ఆ మహనీయుని జన్మదినాన్ని 2001 నుంచి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నది. ఇది కాళోజీకి దక్కిన సముచిత గౌరవం. ఓనాడు తిరస్కరణకు, అవమానాలకు గురైన భాష, మన యాస ఇప్పుడు అందలమెక్కుతున్నది. కాళోజీ స్ఫూర్తితో మన భాషకు మనం పట్టం కట్టి గౌరవించుకోవాలి.

తెలంగాణ భాషకు, భావజాలానికి, ప్రాంతీయ కవిత్వానికి విడదీయరాని సంబంధమున్న కాళోజి 9-9-1914లో హన్మకొండలో జన్మించారు. 13-11-2002లో మృతి చెందారు. కాళోజీ నిజాం నిరంకుశ పాలనపై నిర్బంధంగా ఉద్యమిస్తూ దాదాపు 1987 వరకు తెలంగాణ ఉద్యమ కవితలు రాశారు. పౌర హక్కుల కోసం నిజాయితీగా పోరాడుతూ కలాన్ని ఖడ్గంగా ఉపయోగించారు.

న్యాయశాస్త్రం చదివినా ఏనాడూ ప్రాక్టీస్ చేయకుండా, ఉద్యోగం చేయకుండా తండ్రి అనంతరం అన్న రామేశ్వర్‌రావు పోషణలో పెరిగారు. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమయ్యే కాళోజీ ఉద్యమనేతగా, రాజకీయవాదిగా, కవిగా, భాషోద్యమనేతగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయారు. ప్రశ్నించే తత్వాన్ని నేర్చుకుని ఇతరులకు నేర్పిన మహోన్నతుడు. సిద్ధాంత నిబద్ధత నచ్చేస్వేచ్ఛావాదిగా ధర్మపోరాటం చేస్తూ ప్రజాకవిగా తెలంగాణలోని అణువణువునా కనిపిస్తూనే ఉంటారు.

● జిల్లాతో అనుబంధం..

ఉమ్మడి జిల్లాతో, కవులతో కాళోజీకి మంచి అనుబంధం ఉంది. ఆయన కరీంనగర్‌కు 2001లో వచ్చారు. ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో 2001 డిసెంబరు 7, 8 తేదీల్లో జరిగిన తెలంగాణ మాండలిక సాహిత్యంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో రచయిత దాశరథి రంగాచార్యతో కలిసి పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ కాళ్లు, చేతులు వణుకుతున్నా ఉద్వేగంతో ఆయన చేసిన ప్రసంగం చైతన్య పరిచింది. జిల్లాకు చెందిన ఎందరో కవులు, రచయితలు హన్మకొండకు వెళ్లి ఆయనను కలిసి వచ్చేవారు. జిల్లాకు చెందిన మాజీ ప్రధాని పీవీతో కాళోజీకి అత్యంత సన్నిహిత సంబంధాలుండేవి.

రవాణాశాఖలో శిక్షణకు ఎంపికైన ఏఎంవీఐలు

- 15 రోజులపాటు జిల్లా రవాణాశాఖ కార్యాలయ పరిధిలో విధులు
- తనిఖీల్లో 10 వాహనాల జప్తు



అలుగునూర్‌లో వాహనాల తనిఖీపై ఏఎంవీఐలకు శిక్షణ ఇస్తున్న టీటీసీ, డీటీవో

తిమ్మాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రవాణాశాఖలో నూతనంగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)లను నియమించింది. శిక్షణలో భాగంగా మండలంలోని జిల్లారవాణాశాఖ కార్యాలయానికి 10మంది నూతనంగా ఎంపికైన ఏఎంవీఐలు ఏ మనోజ్‌కుమార్, బి స్వాతి, డి మనోజ్ కుమార్, బి శిరీషా, డి అఖిల, ఎం శ్వేత, జి జాన్ రోనాల్డ్ ఈద, బి నవిత, సీహెచ్ మమత డీటీసీ పురుషోత్తంకు సోమవారం రిపోర్ట్ చేశారు. వీరు 15రోజుల పాటు కరీంనగర్ ఆర్టీవో శ్రీకాంత్‌చక్రవర్తి ఆద్వర్యంలో శిక్షణ తీసుకోనున్నారు. మొదటిరోజు శిక్షణలో భాగంగా నూతనంగా విధుల్లోకి చేరిన ఏఎంవీఐలతో కలిసి డీటీసీ, డీటీవో, నూతనంగా విధుల్లోచేరిన ఏఎంవీఐలతో కలిసి అలుగునూర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వీరికి 15 రోజులపాటు వాహనాల తనిఖీలు, చెక్ రిపోర్ట్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజల రవాణాభద్రత కోసం ఇలాంటి తనిఖీలు, శిక్షణ నిరంతరం కొనసాగుతాయని అన్నారు. తనిఖీలోభాగంగా టాక్సులు, పొల్యూషన్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్‌లేని వివిధరకాల 10వాహనాలను జప్తుచేసినట్లు శ్రీకాంత్‌చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ పురుషోత్తం, డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవీకుమార్, ఏఎంవీఐ శ్రవంతి, రవాణా శిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు బాయిలో చోరీకి యత్నం

గోదావరిఖని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీడీకే 2ఇంక్లైన్ బొగ్గు గనిలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. మూతబడిన టన్నెల్‌లోకి దిగి కాపర్‌వైరు, ఇనుప సామాన్లు దొంగిలించేందుకు ప్రయత్నించారు. గనిలోని 3, 4 సీములు, 17వలెవల్‌లో గతంలో బొగ్గు తీసి ఆ ప్రాంతాన్ని వదిలేశారు. గనివెనుక భాగం నుంచి సుమారు 8మంది బొగ్గు బాయిలోకి దిగారు. రాత్రి కావడం, అండర్‌గ్రౌండ్ కావడంతో దొంగలు టార్చ్‌లైట్లను తీసుకువచ్చారు. ఆ లైట్ల వెలుతురును గనిలో పని చేస్తున్న కొందరు కార్మికులు గమనించారు. ఎవరని ప్రశ్నించి కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. ఈ విషయాన్ని కార్మికులు అధికారులకు తెలియజేయడంతో ఎస్ అండ్‌పీసీ సిబ్బందిని పంపించగా అప్పటికే దొంగలు పరారయ్యారు. బొగ్గు గని లోపల దొంగతనానికి యత్నించడం చర్చనీయాంశమైంది.

లైంగిక దాడి ఘటనపై కొనసాగుతున్న విచారణ

- ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్, సీపీ
- డాక్టర్, సిబ్బంది విచారణ...
- ఎమర్జెన్సీ వార్డులో తాగుబోతు కాంపౌండర్ విధులు..?

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆదివారం వేకువజామున ఓ యువతిపై జరిగిన లైంగిక దాడి ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతున్నది. వైద్యసేవల కోసం వచ్చిన యువతిపై ఆ ఆసుపత్రి కాంపౌండర్ దక్షిణమూర్తి అఘాయిత్యానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఆసుపత్రి నిర్వాహకుల నిర్లక్ష్యాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. యువతికి మత్తుమందు ఇచ్చి లైంగికదాడికి పాల్పడిన దక్షిణామూర్తి (24) అనే కాంపౌండర్ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ సహాయకుడిగా పని చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అంతకు ముందు రెండు ఆసుపత్రుల్లో పనిచేసిన దక్షిణామూర్తి మద్యం సేవించి విధులకు వస్తుండటంతో ఆ ఆసుపత్రుల యాజమాన్యం విధుల నుంచి తొలగించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయినా దక్షిణామూర్తిని ఆసుపత్రిలో కీలకమైన ఎమర్జెన్సీ వార్డు, ఆపరేషన్ థియేటర్‌లో ఉద్యోగంలో పెట్టుకోవడంపై ఆసుపత్రి యజమాన్యంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఒక కాంపౌండర్ స్థాయి వ్యక్తి యువతికి మత్తుమందు ఇవ్వడంపై ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ మత్తుమందు కొద్దిపాటి డోస్ అధికమైనా పేషెంట్ ప్రాణానికే ప్రమాదంగా మారుతుంది. అనస్థీషియా మందు ఆ కాంపౌండర్‌కు ఎలా లభించింది? అనేది ప్రశ్నర్థకంగా మారింది. ఘటనను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, పోలీస్ కమిషనర్ సోమవారం ఆసుపత్రికి వెళ్లి పరిశీలించారు. ఆసుపత్రి యజమాని అయిన డాక్టర్‌తోపాటు సిబ్బందిని విచారించారు. రికార్డులను పరిశీలించి, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే డీఎంహెచ్‌వోను రప్పించి తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి నిర్వహణ నిబంధనల ప్రకారం లేదంటూ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్‌లోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పేషెంట్ల పట్ల, చికిత్సల పట్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగుతుందనే విమర్శలున్నాయి. ఏవైనా ఘటనలు వెలుగు చూసినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేయడం, ఆ తరువాత పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. డాక్టర్, ఆసుపత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఆసుపత్రి గుర్తింపును రద్దు చేయాలని పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

● యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అత్యాచారం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సోమవారం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు తెలిపారు. ఆసుపత్రిలో లభించిన ఇంజక్షన్, బెడ్‌షీట్ వంటి కొన్ని ఆధారాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామన్నారు. రిపోర్ట్ వచ్చిన తరువాత చర్యలుంటాయని తెలిపారు. నిందితుడిని త్వరలో అరెస్టు చూపుతామని, పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెగడపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామశివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో శెకల్ల గ్రామానికిచెందిన జక్కు ఆనంద్(25) అనేయువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆనంద్ ఆదివారం రాత్రి తనఅత్తగారి ఊరైన బతికెపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లింగాపూర్ గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం మృతుడి తండ్రి జక్కువెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



శ్రీకర్‌రెడ్డి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాలువలో గల్లంతైన కాటిపెల్లి శ్రీకర్‌రెడ్డి(30) అనేయువకుడి మృతదేహం 13 రోజుల తరువాత సోమవారం లభ్యమైంది. మెట్‌పల్లి మాజీజడ్పీటీసీ సభ్యురాలు కాటిపెల్లి రాధ, కాంగ్రెస్‌నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి దంపతుల కుమారుడు శ్రీకర్‌రెడ్డి గతనెల 27న మండలంలోని రామారావుపల్లి గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాలువలో గల్లంత య్యాడు. వినాయకచవితి సందర్భంగా పెద్దాపూర్ గ్రామశివారులోని పౌల్ట్రీఫాంలో గణపతి పూజ నిర్వహించి ట్రాక్టర్‌లో ఇద్దరు స్నేహితులతో కలిసి ఇంటికి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు మిత్రులు ఒడ్డుపై పడగా కాటిపల్లి శ్రీకర్‌రెడ్డి కాలువలో పడి గల్లంతయ్యాడు. అప్పటినుంచి కుటుంబసభ్యులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. 13రోజుల తరువాత తాటిపెల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం లభ్యమైంది. స్థానికులుగమనించి కుటుంబ సభ్యులకు తెలపగా వారు పరిశీలించి శ్రీకర్‌రెడ్డిగా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరి వేసుకొని వలస కూలీ ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ ఇటుకబట్టీలో పనిచేసేందుకు వచ్చిన వలసకూలీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జానీ(29) వలసకూలీ. తాగుడుకు బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎవరూ లేరని మనస్తాపానికి గురయ్యేవాడు. ఈక్రమంలోనే సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిబంధువు డమురుజానీ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లిరూరల్ ఎస్సై మల్లేష్ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి జీపీ కార్మికుడి మృతి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపేట గ్రామ పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ కార్మికుడు బండ రాజయ్య(52) ప్రమాదవశాత్తు సోమవారం మృతిచెందాడు. చెట్లకొమ్మలు కొడుతుండగా రాజయ్య ఒక్కసారిగా కిందపడ్డాడు. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ప్రభుతేజ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

మంథనిరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ శివారు గోదావరి నది ఎల్ మడుగు ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. సుమారు 30-35 వయస్సు, ప్యాంట్, షర్టు ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమేష్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో పంచనామా అనంతరం అంత్యక్రియలు పూర్తిచేశారు. కేసునమోదుచేసుకొనిదర్యాప్తు చేస్తున్నామన్నారు.

గొర్రెల మందను ఢీకొన్న బైక్

- ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపల్లి శివారులో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై వెళ్తున్న గొర్రెల మందను సోమవారం బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన వాహనదారుడు ముత్తయ్యగారి రవి, అతని కొడుకు సాయిలతో పాటు గాజులపల్లిలోని గొర్రెలకాపారి పెద్దోళ్ల కుర్మ ఎల్లయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. పలు జీవాలు గాయ పడ్డాయి. రవి, సాయిలను 108 వాహనంలో ఎల్లయ్యను ఓ ప్రైవేటు వాహనంలో సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. గాజులపల్లికి చెందిన ఎల్లయ్య తన గొర్రెలను మేతకు తీసుకెళ్లి తిరిగి ప్రధాన రహదారి వెంట ఇంటికి తీసుకెళుతున్నాడు. గంభీరావుపేటలోని రవి తన కొడుకు సాయితో కలిసి ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపుకు వెళుతూ గొర్రెల మందను అతివేగంగా ఢీకొట్టాడు. రవి, సాయితో పాటు అక్కడే ఉన్న గొర్రెల కాపారి ఎల్లయ్య తీవ్ర గాయాలపాలయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

'కొండ'కు నూతన శోభ

మల్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు కొండపై గల ఆంజనేయస్వామి ఆలయ పరిధిలోని పెద్ద బండరాళ్లకు రంగులు వేయించడంతో ఆలయ పరిసరాలు నూతన శోభను సంతరించుకున్నాయి. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుట్టపైనున్న బండరాళ్లకు వేసిన రంగులు

సీపీగెట్ ఫలితాల్లో ఎస్సారార్ విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



అఖిల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీపీగెట్ ఫలితాల్లో ఎస్సారార్ కళాశాలకు చెందిన పుట్టి అఖిల వృక్షశాస్త్ర విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో ఎస్సారార్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంఘం సహకారంతో నిర్వహించిన ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. అఖిలతోపాటు విద్యార్థులు బి.మేఘమాల 6వ ర్యాంకు, సీహెచ్. సాగరిక 53, సుమయ జబీన్ 69, ఆర్. సుధాకర్ 57, కె.మౌనిక 98, జి.నర్మదా 96, మౌనిక 134, వి.మహేందర్ 324, సీహెచ్.పల్లవి రెడ్డి 334, కే. అంజలి 819, ఎన్.రోజా 893, బి.అఖిల 957వ ర్యాంకుతోపాటు 40 మంది ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సారార్ కళాశాలతో పాటు, హైదరాబాదు లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి ఉమెన్స్ కాలేజ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాల, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీకళాశాల జగిత్యాల సంయుక్తంగా ఆన్‌లైన్ కోచింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ మొదటి ర్యాంకు సాధించిన అఖిలను అభినందించారు.

వాగులో పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

మంథని, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని బొక్కలవాగులో ఆదివారం రాత్రి భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల గ్రామానికిచెందిన కామ సురేష్ వాగులో పడ్డాడు. అదేసమయంలో అటుగావెళ్తున్న పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది గమనించి 108కు సమాచారం ఇచ్చారు. 108 మెడికల్ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్, పైలెట్ ఆకుల మల్లేష్, పోలీసులు కలిసి అతడిని బయటకు తీసి ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వచ్చి సురేష్ ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందికి, పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- ట్రాన్స్‌ఫార్మర్ కోసం గద్దె నిర్మించారు
- దానిపై పెట్టడం మరిచారు

తిమ్మాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాజీవ్ రహదారిని ఆనుకొని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఓ బండ రాయిపై ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఓ వైపు కిందికి వంగినట్లు ఉండటంతో అదిచూసిన వారు భయాందోళకు గురవుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాయిపై నుంచి మార్చేందుకు ఏనాడో ఓ గద్దెను కూడా నిర్మించిన విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ పెట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రాజీవ్ రహదారికి ఆనుకొని ఉండటం.. నిత్యం వందల వాహనాలు, ప్రయాణికులు ఈ దారి వెంబడి ప్రయాణిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బండ రాయి చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి ప్రమాదంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి కంచే ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో ఏదైనా ప్రమాదం సంభవించే ఆస్కారం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బండ రాయిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దాని కోసం నిర్మించిన గద్దెపైకి మార్చి కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రాజీవ్ రహదారికి ఆనుకొని బండరాయిపై వంగి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అధ్వానంగా రహదారి



గొయ్యి ఉన్నది జాగ్రత్త అని కట్టెకు ప్లకార్డు పెట్టిన స్థానికులు

గుంతలుగా ఖని వన్‌టౌన్ టూ ఎల్‌బీనగర్ రోడ్డు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. కొన్ని నెలలుగా రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. గుంతలమయమైన రహదారిపై వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలకు రహదారిపై నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో నీరు నిలిచి ఉండటంతో గొయ్యి ఏర్పడింది. రహదారిని ఆనుకొని ప్రైవేట్ పాఠశాలలు ఉండడంతో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. స్కూల్ బస్సులు, ఆర్‌టీసీ బస్సులు కూడా ఈ రహదారి గుండా వెళుతుంటాయి. దీంతో ఆ గొయ్యిలో పడి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. అయినా ఎవరు పట్టించుకోకపోవడంతో అక్కడే ఉన్న స్థానికులు కట్టెను పెట్టి ఇక్కడ గొయ్యి ఉన్నది జాగ్రత్త అని ప్లకార్డు పెట్టారు. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు.



కాలువను తలపిస్తున్న ఖని ఎల్‌బీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

రహదారి పక్కన డ్రైనేజీ లీకేజీ...

గుంతలమైన రహదారితోపాటు పక్కనే డ్రైనేజీ నీరు లీకేజీతో దుర్గంధం వెదజల్లుతోంది. అంతే కాకుండా పారిశుధ్యం లోపించి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధుల సమయం కావడంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని, డ్రైనేజీని మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

30 నుంచి ముంబయికి ప్రత్యేక రైలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధికి మహరాష్ట్ర లోని ముంబయి, బీండి ప్రాంతాలకు వలస వెళ్లిన కార్మికుల కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు కరీంనగర్‌కు ప్రత్యేక రైలును నడపనున్నారు ఈ నెల 30 నుంచి నవంబరు 25వరకు ప్రతీ మంగళవారం రైలు నడవనుంది. మధ్యహ్నాం 3.30గంటలకు ముంబయి లోని లోక్‌మాన్యతిలక్ టెర్మినల్ (ఎల్‌ఎల్‌టీ) నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు కరీంనగర్ నుంచి బయల్దేరి గురువారం మధ్యాహ్నం 1.40 గంటలకు ముంబయి చేరుకుటుంది. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో హాల్టింగ్ కల్పించారు. బాసర, నాసిక్, షిర్డీ వెళ్లేందుకు రైలు సౌకర్యంగా ఉంటుంది.

రాజన్న ఆలయానికి రూ. 2.18 కోట్లతో సబ్‌స్టేషన్ మంజూరు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానానికి నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.2.18కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయానికి ఆధునిక విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుందని అందులో బాగంగానే 33/11 కేవీ సామర్థ్యంతో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థ సీఎండి వరుణ్‌రెడ్డి అధికారంగా ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో రాజన్న ఆలయంలో లోవోల్టేజ్ సమస్యలు లేకుండా ఉటుందని, పరిసర ప్రాంతాలకు సైతం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందు తుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు విప్ ఆదిశ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మపురి నరసింహుడి ఆలయ ప్రసాదాల రేట్లు పెంపు

ధర్మపురి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రసాదాలరేట్లు పెంచినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒకప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఉత్తర్వులమేరకు గతంలోఉన్న లడ్డూ ప్రసాదం రేటు రూ.20నుంచి25 రూపాయలకు, 200గ్రాముల పులిహోర ప్రసాదం రూ.15నుంచి 20రూపాయలకు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదం 80గ్రాముల నుంచి 100గ్రాముల వరకు పెంచినట్లు ఆయన తెలిపారు. భక్తులు గమనించా లని ఆయన కోరారు.



ఆన్‌లైన్‌లో వైద్యసేవలు

- రోగులకు అందుబాటులో ఆయుష్మాన్ భారత్ యాప్
- అందుబాటులో హెల్త్ ప్రొఫైల్, ల్యాబ్ రిపోర్టులు

చొప్పదండి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే సేవలన్నీ ఆన్‌లైన్ లో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై అర చేతిలో అన్ని సేవలు, పరీక్షలు, రిపోర్టులు, హెల్త్ ప్రొ ఫైల్ అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఆసు పత్రుల ఓపీ కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలుచోవాల్సిన పని లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాప్‌ను రూపొందించాయి.

గతంలో రోగులకున్న సమస్య, వాడుతున్న మందులు, ల్యాబ్ పరీక్షలు, ఫలితాలన్నీ యాప్‌లో ఉంటాయి. ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు ఆయుష్మాన్ భారత్ యాప్(అభా)ను సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆసుపత్రికి వెళ్లగానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే యాప్‌లో నమోదవుతుంది. రోగి హెల్త్ ప్రొ ఫైల్ మొత్తం అభా ఐడీలో పొందు పరుస్తారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఈ యాప్ ద్వారా వైద్య సేవలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి.

అభా పనిచేస్తుంది ఇలా...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాప్‌ను రూపొందించాయి. అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభా యాప్ ద్వారా వైద్య సేవలను అందిస్తున్నారు. రోగి తన మొబైల్ ఫోన్‌లో ఆధార్ ఆధారంగా అభా హెల్త్ అకౌంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కోవాలి. హెల్త్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలి. అభా కార్డు అకౌంట్ నంబర్ వస్తుంది. రోగి ఏదైనా ఆసుపత్రికి వెళ్లినప్పుడు ఓపీ కోసం లైన్‌లో నిలుచోవాల్సిన అవసరం లేకుండా ఓపీ కౌంటర్ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను అభా యాప్‌తో స్కాన్ చేయాలి. వెంటనే ఓ నంబర్ మొబైల్‌కు వస్తుంది. ఆ నంబర్‌ను ఓపీ కౌంటర్‌లో చూపించగానే, రోగి పేరుతో చీటి ఇవ్వ గానే డాక్టర్ వద్దకు వెళ్లాలి. ఏవైనా వైద్య పరీక్షలు చేయించుకుంటే ల్యాబ్ రిపోర్టులను అభాహెల్త్ కార్డులో పొందు పరుస్తారు. రిపోర్టుల కోసం ఎదురు చూడకుండా మొబైల్‌లోనే డాక్టర్‌కు ల్యాబ్ రిపోర్టులను చూపిస్తే సరిపోతుంది. తర్వాత డాక్టర్ రాసి న మందుల చీటిని (ప్రిస్కిప్షన్) కూడా యాప్‌లో పొందుపరుస్తారు. తద్వారా రోగి ఏ మందులు వాడు తున్నాడో సమాచారం యాప్‌లో నమోదవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో రోగికి సంబంధించిన పరీక్షలు, మందుల వాడకం వివ రాలు డాక్టర్‌కు తెలుస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసు పత్రికి వచ్చే రోగి ఆరోగ్య వివరాలను, షుగర్, బీపీతో ఇతర వ్యాధులకు సంబంధించిన వివరాలు డాక్టర్‌కు తెలుస్తాయి. తద్వా రా ఎలాంటి చికిత్సలు అందించాలో వైద్యులకు ఒక అవగాహనకు వస్తారు. హెల్త్ కార్డు ద్వారా రోగితో పాటు వైద్యులకు ఎంతో ఉపయోగకరం గా ఉంటుంది. అన్ని వివరాలు, సేవలు అభా యాప్‌లో అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో కార్డు ఉన్న ప్రతి ఒక్కరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.



తెరుచుకున్న ఆలయాలు

- ఆలయాల్లో శుద్ధి, సంప్రోక్షణ

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి రాజన్న ఆలయం మూసివేయగా సోమవారం తెల్లవారుజామున ఉదయం 3.45 గంటలకు ఆలయాన్ని తెరిచారు. ఆలయసిబ్బంది ఆలయ గోపురాలు, విగ్రహాలను శుద్ధిచేశారు. అనంతరం అర్చకులు ఆలయంలో తిరుగా సంప్రోక్షణ చేశారు. మంగళవాయి ద్యాలు, సుప్రభాతం గావించారు. పూజలునిర్వహించి భక్తులకు దర్శనాలకు, నిత్యపూజలకు అనుమతిచ్చారు.

రాజన్నను దర్శించుకున్న భక్తులు

శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించి పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం రాజన్నను దర్శించుకుని తరించారు. కొందరు స్వామివారికి ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు



ధర్మపురిలో విగ్రహాల తొడుగులను కడుగుతున్న అర్చకులు

ధర్మపురిలో..

ధర్మపురి: సంపూర్ణ చంద్రగ్రహణం వీడిన అనంతరం ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని సోమవారం ఉదయం తెరచి ఉంచారు. అర్చకులు సంప్రోక్షణ, చంద్రగ్రహణ శాంతి హోమం, పూర్ణాహుతి, అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. చంద్ర గ్రహణం వీడిన అనంతరం ధర్మపురి గోదావరి నదిలో భక్తులు సోమవారం గ్రహణ స్నానాలు ఆచరించారు. అనంతరం భారీసంఖ్యలో భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయధర్మకర్తలమండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: చంద్రగ్రహణం దృష్ట్యా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేయగా సోమవారం వేకువజామున ఆలయంలో పుణ్యాహవచనం, సంప్రోక్షణ, తిరుమంజనం, ఆరాధన పూజలు జరిపిన అనంతరం ఉదయం 7గంటలకు తెరిచారు. అనంతరం యథావిధిగా దర్శనాలు, ఆర్జితసేవలు పునరుద్ధరించగా వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

చికితను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



చికితను సన్మానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఎలిగేడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరెన్నో విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గుర్తింపుతేవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల కెనడాలో జరిగిన ప్రపంచయూత్ ఆర్చరీ చాంపియన్ షిప్‌లో స్వర్ణ పతకం సాధించి వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తానిపర్తి చికిత సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోగల సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలువగా సీఎం చికితను అభినందించారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా రాష్ట్రప్రభుత్వం తరపున చికితకు శిక్షణ అందించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్‌రావు, స్పోర్ట్స్‌అథారిటీచైర్మన్ శివసేన రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, మాజీసర్పంచ్ అర్వణపల్లి వెంకటేశ్వర్ రావు, తానిపర్తి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక



అంపశయ్య నవీన్



అంతడుపుల రమాదేవి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఈ ఏడాది సాహిత్య విభాగంలో నవలా రచయిత అంపశయ్య నవీన్, కళా రంగంలో అంతడుపుల రమాదేవి ఎంపికైనట్లు అవార్డుల కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తనతండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏటారచయితలు, కళకారులకు పురస్కారాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఎంపికకమిటీ కన్వీనర్ డాక్టర్ పొన్నం రవిచంద్ర సారథ్యంలో జ్యూరీకమిటీసభ్యులు కేంద్రసమాచారశాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, జర్నలిస్టు దిలీప్‌రెడ్డి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి సోమవారం కరీంనగర్‌లో ట్రస్టు చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపిక పత్రాన్ని అందజేశారు. పొన్నం సత్తయ్య 15వవర్ధంతి సందర్భంగా ఈనెల 13వ తేదీన రవీంద్ర భారతిలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

అన్నదాతకు కరెంటు కష్టాలు

- వర్షాలతో పోల్స్ విరిగి తెగిన విద్యుత్ లైన్లు
- జనరేటర్‌తో పంటలకు నీరు

గంభీరావుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు కొట్టుకుపోగా, మరికొన్ని పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఇదిలా ఉంటే వరదల కారణంగా కొన్ని గ్రామాల్లో విద్యుత్ పోల్స్ విగిరి, లైన్లు తెగిపోయాయి. దీంతో కరంటు సరపరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో బోరుబావుల్లో, వ్యవసాయ బావుల్లో నీళ్ల సమృద్ధిగా ఉన్నా పంటలు ఎండిపోయే దశకు చేరుతున్నాయి. మండుతున్న ఎండలకు వరిపంటకు నీళ్ల అందక ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు జనరేటర్ సహాయంతో మోటార్లు నడిపిస్తూ పంటలను రక్షించుకుంటున్నారు. భారీ వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు మత్తడి దూకి, వాగులు ఉప్పొంగాయి. దీంతో కరుంటు స్తంబాలు విరిగి లైన్లు తెగిపోయాయి. ప్రధానంగా మండలంలోని మల్లారెడ్డిపేట ప్రాంతంలో విద్యుత్ సరపరాకు అంతరాయం ఏర్పడటంతో పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. దీంతో వరి పంటను కాపాడుకోటానికి మల్లారెడ్డిపేటకు చెందిన రైతు భూపతి జనరేటర్ కిరాయి తెచ్చాడు. జనరేటర్ సహాయంలో వరి పంటకు నీరు పెడుతున్నాడు. ఎకరం పంటకు జనరేటర్ కిరాయితో పాటు డీజిల్ ఖర్చుతో 2 వేల వరకు అవుతున్నాయని రైతు భూపతి ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ పోల్స్ వైర్లను సరిచేసి కరంటు కష్టాలు తీర్చాలని రైతు భూపతి అధికారులను వేడుకుంటున్నాడు.



మల్లారెడ్డిపేటలో పంటను కాపాడేందుకు జనరేటర్ సహాయంతో నీరు అందిస్తున్న రైతు

జేఎన్టీయూ విద్యార్థుల రాస్తారోకో

- వేములవాడ-సిరిసిల్ల రోడ్డుపై గంటకు పైగా బైఠాయింపు
- నూతన క్యాంపస్ ఏర్పాటు చేయాలని డిమాండ్



రాస్తారోకో చేస్తున్న జేఎన్టీయూ విద్యార్థులు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూ కళాశాలకు నూతన క్యాంపస్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థిసంఘం నాయకులు వేములవాడ-సిరిసిల్ల ప్రధానరహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. తంగళపల్లి మండలం మండెపల్లి గ్రామంలో జేఎన్‌టీయూ కళాశాల నిర్మించేందుకు గత ప్రభుత్వం జీవో జారీ చేసిందని, వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జేఎన్‌టీయూకు అప్పగించిన భవనంలోని తరగతి గదులకు తాళం వేశారని, దీంతో తీవ్ర ఆందోళనకు గురై రాస్తారోకో చేసినట్లు విద్యార్థులు తెలిపారు. కళాశాలలో ఎలాంటి సౌకర్యాలు లేవని, ల్యాబ్‌కోసం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు జేఎన్‌టీయూ యూనివర్సిటీకి ప్రాక్టికల్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏఎస్పీ చంద్రయ్య, సీఐ వీరప్రసాద్‌లు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో రోడ్డు పైన భారీగా వాహనాలు నిలిచిపో యాయి. దీంతో పోలీసులు విద్యార్థులను, విద్యార్థి సంఘం నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఓ విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో తోటి విద్యార్థులకు పక్కకు తీసుకెళ్లారు.

విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలి

- బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనర్సింహారావు

జేఎన్‌టీయూ విద్యార్థుల నాణ్యమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్‌నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు డిమాండ్‌చేశారు. విద్యార్థుల రాస్తారోకో విషయం తెలుసుకున్న లక్ష్మీనర్సిం హారావు పోలీస్‌స్టేషన్‌లోని విద్యార్థులను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం చల్మెడ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లాలో జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఉండాలని మండెపల్లిలో 20 ఎకరాల స్థలాన్ని చూసి, సుమారు రూ. 450 కోట్లతో జీవో విడుదల చేశారని గుర్తు చేశారు. వెంటనే జేఎన్‌టీయూ భవనానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బొల్లా రామ్మోహన్, రామతీర్థాపు రాజు, కంకణాల క్రాంతి, మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, నీలం శేఖర్ తదితరులు ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

- భీమేశ్వర ఆలయంలో పనులు పూర్తి చేయాలి
- రాజన్న ఆలయ ఈవో రమాదేవి



భీమేశ్వర సదన్ వసతిగృహంలో తనిఖీ చేస్తున్న ఈవో రమాదేవి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆయా విభాగాల ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఈవో రమాదేవి సూచించారు. రాజన్న ఆలయంలోని భీమేశ్వర సదన్ వసతి గృహాలను, భీమేశ్వర ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం తనిఖీ చేశారు. వసతిగృహంలో ఆన్‌లైన్ ద్వారా, ఆఫ్‌లైన్ ద్వారా భక్తులు ఎన్ని రూమ్‌లు బుక్ చేసుకున్నారని, ఎన్ని రూములు ఖాళీగా ఉంటున్నాయని ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. రూములకోసం వచ్చే భక్తులతో మర్యాద పూర్వంగా మెదలాలని ఈవో సూచించారు. భీమేశ్వర ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. భీమేశ్వర ఆలయంలో చేపడుతున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి కావాలని, దానికి అనుగుణంగా ఉద్యోగులు, భక్తులు సహకరించాలని కోరారు. రాజన్నఆలయానికి వచ్చేభక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునే భక్తులకోసం ఈ-టికెటింగ్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు.

ఏఎస్పీని కలిసిన ఈవో రమాదేవి

వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిని రాజన్న ఆలయఈవో రమాదేవి సోమవారం కలిశారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీకి పూలమొక్కను, రాజన్నప్రసాదాన్ని అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై చర్చించారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టునుంచి గేట్లద్వారా గోదావరిలోకి నీరు వదలడం సోమవారం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువప్రాంతం నుంచి 54,185క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 8గేట్లు పైకిఎత్తి నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టునీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరునిల్వ ఉంది. వరదకాలువకు 19,000 క్యూసెక్కులు, కాకతీయకాలువకు 5,500క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 684క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

'అన్నపూర్ణ'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ ప్రస్తుతం 3.23టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 6,400క్యూసెక్కుల నీటిని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తుండగా, అక్కడినుంచి రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్‌మానేరు) సోమవారం 16,800ఇన్‌ఫ్లో ఉన్నది. ఎస్సారెస్పీనుంచి వరద కాలువద్వారా 16,300, మానేరు మూలవాగు ద్వారా 500క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువన ఉన్న ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్లద్వారా 10వేల క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటినితరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.19టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీకి పెరిగిన ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్: కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలోకి ఎగువనుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో నీటిమట్టం 23టీఎంసీ లకు చేరింది. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మిడ్‌మానేరు) గేట్లు తిరిగి బుధవారం ఉదయం ఎత్తి ఎల్‌ఎండీలోకి అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం మిడ్‌మా నేరునుంచి 10వేల క్యూసెక్కుల వస్తుండగా వాటితోపాటు ఎగువ కాకా తీయ కాలువనుంచి 900 క్యూసెక్కులు, మోయ తుమ్మెద వాగునుంచి 239క్యూసెక్కులు కలిపి 11,139 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. అదేవిధంగా ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు 3వేలక్యూసెక్కుల నుంచి బుధవారం 5వేలక్యూసెక్కుల పెంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 305 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోవెలుతోంది. ఎల్‌ఎండీ పూర్తినీటిసామర్థ్యం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.044 టీఎం సీల నీరు నిల్వ ఉంది.



కాకతీయ కాలువ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

నేడు ఎల్‌ఎండీ గేట్లు ఎత్తే అవకాశం?

సోమవారం చాలాచోట్ల వర్షం కురిసింది. దీంతో ఎగువ నుంచి ఎల్‌ఎండీలోకి ప్రస్తుతం వస్తున్న పెరిగిన వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా మంగళవారం ఎల్‌ఎండీ గేట్లు అవసరం మేరా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఒకవేళ ఇన్‌ఫ్లో తగ్గితే మాత్రం కొద్దిగా ఆలస్యం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే కాకతీయ కాలువ ద్వారా దిగువకు 5వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇప్పటికే ఎగువనుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో ఎల్‌ఎండీ దాదాపుగా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. కాబట్టి ఎల్‌ఎండీ గేట్లు ఎత్తే అవకాశం ఎక్కువగా ఉంది.

'కందుకూరి' రావికంటి వసునందన్ సాహిత్య పురస్కారం



కందుకూరి అంజయ్య

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ రావికంటి వసునందన్ సాహిత్యపురస్కారానికి రచయిత కందుకూరి అంజయ్య ఎంపికైనట్లు పరిషత్తు ప్రధానకార్యదర్శి డాక్టర్ చెన్నయ్య ప్రకటనలో తెలిపారు. ఏటా అందజేసే తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి సాహిత్య పురస్కారాల్లో భాగంగా ఈ ఏడాదికి అంజయ్యను ఎంపిక చేశారు. ఈనెల18న పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పురస్కారం అందజేయనున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం గుళ్లకోటలో జన్మించిన అంజయ్య ఎంఏ ఎంఫిల్ పూర్తి చేశారు. చేనేత జౌళిశాఖలో డిప్యూటీడైరెక్టర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. కట్టెపల్క, జమిడిక పుస్తకాలను వెలువరించారు. ఎన్నీల ముచ్చట్ల కవితాసంపుటలకు, విద్యార్థి కలం పుస్తకానికి సంపాదకులుగా వ్యవహరించారు. అలిశెట్టి ప్రభాకర్, అక్కెపెల్లి ఫౌండేషన్ సినారె విశిష్ట పురస్కారాలను అందుకున్నారు.

కొత్తపేట భూ నిర్వాసితులకు పరిహారం మంజూరు



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న భూనిర్వాసితులు

బోయినపల్లి, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన బోయినపల్లి మండలంలోని కొత్తపేట భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ చట్టం ద్వారా పరిహారం మంజూరైంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో కొత్తపేట గ్రామానికి చెందిన 75 మంది రైతుల భూములు కోల్పోయారు. 2011నుంచి ప్రత్యేక పరిహారం కోసం నిర్వాసితులు వేచిచూస్తున్నారు. నిర్వాసితుల సమస్యలను మానవాడ సింగిల్ విండో చైర్మన్ దుర్గారెడ్డి స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఎమ్మెల్యే కొత్తపేట నిర్వాసితులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి వెళ్లారు. ఈ మేరకు నిర్వాసితులకు 79 లక్షల 84వేల370 రూపాయలను మంజూరు చేస్తున్నట్టు ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ జీవో విడుదల చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను నిర్వాసితులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బడి మానేసిన వారిని గుర్తించాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బడిమానివేసిన వారిని గుర్తించి పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. ఎమ్మార్సీ భవనంలో సోమవారం న్యూఇండియా లిటర్సీపై అవగాహన సమావేశం జరిగింది. పిల్లలందరూ బడిలో ఉండాలని, 15సంవత్సరాలు దాటిన వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు గుర్రం సందీప్‌రెడ్డి, యాద రవిలతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు..

కోతకు గురైన మత్తడి.. యువకుల శ్రమదానం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని లొద్దితండా శివారులోని తుంగ్యా చెరువు మత్తడి వద్ద కోతకు గురైంది. నీరంతా వృధాగా పోతుండటంతో సోమవారం యువకులు, స్థానికులు శ్రమదానం చేశారు. సంచుల్లో ఇసుక నింపి అడ్డుగా వేశారు. ప్రతి యేటా చెరువు మత్తడి వద్ద కోతకు గురైనా మరమ్మతు పనులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శాశ్వత పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో యువకులు, స్థానికులు మాలోతు సాయికుమార్, ప్రకాశ్, శ్రీరాం, బాలు, మురళి, గోవింద్ పాల్గొన్నారు.

ముత్యాలపోచమ్మతల్లి వార్షికోత్సవం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతగిరి గ్రామ ముత్యాలపోచమ్మ తల్లి ఆలయంలో మహాశక్తియాగం నిర్వహించారు. ఆలయ 6వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, రుద్రహోమం, మహాచండీ హోమం, చండీపారాయణాలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ కమిటీ చైర్మెన్ కొలిపురి అంతగిరి, కార్యనిర్వాహణాధికారి మారుతిరావు, పాలకమండలి సభ్యులు ముత్తయ్య, పోచవ్వ, ముత్తయ్య, శంకరయ్య, మల్లయ్య, తిరుపతిరెడ్డిలతో పాటు ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం స్టేట్ టీచర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం తెలిపారు. మండల అధ్యక్షునిగా బి రవి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి చంద్రశేఖర్, ఆర్థిక శాఖ సభ్యులుగా శ్రీనివాస్, రజిత, ఉపాధ్యక్షులుగా గంగాధర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా శారద, అపర్ణ, కార్యదర్శులుగా శ్యామ్, శేఖర్, ప్రవళిక, సమీనాలు ఎన్నికయ్యారు.

బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమి పూజ

రుద్రంగి, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో రూ. 5 లక్షలతో బతుకమ్మ తెప్ప నిర్మాణం కోసం సోమవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళల కోరిక మేరకు బతుకమ్మ తెప్పల నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. రుద్రంగిలో నాలుగు బతుకమ్మ తెప్పల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాదర్, తర్రె లింగం, ఇప్ప మహేష్, ఎర్రం రాజలింగం, దయ్యాల శ్రీనివాస్, గండి అశోక్, అక్కనపల్లి శ్రీనివాస్ ఓద్యారపు రమేష్, పండుగు గంగాధర్, దాసు, గుగ్గిళ్ల వేంకటేశం, ననుగుల గంగాధర్ పాల్గొన్నారు,

ఎల్లారెడ్డిపేట పోలీసులకు సన్మానం



పోలీసులను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలు కాపాడడంతో పాటు వినాయక నిమజ్జన వేడుకలను శాంతియుత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేసిన ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాహుల్‌రెడ్డి, ఏఎస్ఐ ఖాజా మజార్ హుస్సేన్, కానిస్టేబుళ్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం కమిటీ సభ్యులు, నేతాజీ సేవా సమితి సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ముస్లీం కమిటీ నాయకుడు, పీఎంపీ వైద్యుడు హైమద్ భగవద్గీత, ఖురాన్‌లను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు చాంద్ పాషా, లాల్‌మహ్మద్, జహంగీర్, అహ్మద్, జాఫర్, దినేశ్, రంజిత్, వెంకటేశ్, రాము, శ్రీనివాస్ వినయ్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో కొత్తపల్లి విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

గంభీరావుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఈషా రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈషా రాష్ట్ర గ్రామోత్సవం టోర్నమెంట్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాచారంలో పోటీలను నిర్వహించారు. రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీల్లో 18 టీంలు పాల్గొన్నాయి. ఇందులో కొత్తపల్లి త్రో బాల్ టీం అత్యంత ప్రతిభ చాటింది. ద్వితీయ స్థానంలో నిలిచిన కొత్తపల్లి టీంకు 8 వేల నగదు, మెమోంటో, సర్టిఫికెట్ అందజేశారు. ఈ పోటీల్లో కొత్తపల్లి విద్యార్థిని హారిక బెస్ట్ ప్లేయర్‌గా ఎన్నికైంది.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం వేణుగోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ పీసు మల్లారెడ్డి కుమారుడు సింగిల్ విండో ఉద్యోగి పీసు వెంకటరమణ రెడ్డి అకస్మికంగా మృతి చెందాడు. సోమవారం కుటుంబాన్ని ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, నాయకులు పడిగల రాజు, జయరామ్‌రెడ్డి పరామర్శించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

కోనరావుపేట, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలలో రాష్ట్రస్థాయిలో జరిగిన ఈఎంఆర్ఎస్ క్రీడలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాము సూరత్ మాట్లాడుతూ ఈ క్రీడల్లో 22 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు జిల్లాలను రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన జి ఏకలవ్య గురుకుల పాఠశాలలు, ఎల్లారెడ్డిపేట, పాల్వంచ, కొత్తగూడెం, ఇందల్వాయి, దుమ్ముగూడ, కురివి, కల్వకుర్తి, గాంధారి, బాలానగర్, గురుకులాలను అభినందించారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి



వృద్ధుడి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన కందికట్కూర్ గ్రామస్థులు



కలెక్టర్ విన్నవించేందుకు వచ్చిన ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో ప్రజలు విన్నవించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సోమవారం ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు తరలివచ్చారు. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 154 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు 49 హౌసింగ్ శాఖకు14, డీఆర్‌డీవోకు 32, జిల్లా విద్యాశాఖకు 13, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 11, ఉపాధి కల్పన శాఖకు 7, సిరిసిల్ల మున్సిపాల్టీకి 5, ఎస్టీసీకి 3, డీసీఎస్‌వోకు 3, జిల్లా సంక్షేమాశాఖకు 2, ఎస్పీ అఫీస్‌కు 2, వేములవాడ దేవస్థానం ఈవోకు 2, ఎస్సీకార్పొరేషన్‌కు 1, జిల్లా వ్యవసాయాధికారికి1, మైనింగ్ ఏడీకి 1, వేములవాడ మున్సిపాల్టీకి 1, జిల్లా వైద్యాధికారికి1, నీటి పారుదల శాఖకు 1, పంచాయితీరాజ్ ఈఈ కి1, డీఐఈవోకు 1, మార్కెటింగ్ శాఖకు 1 లీడ్ బ్యాంక్‌కు 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో హౌజింగ్ ఈఈ శంకర్, జిల్లా పంచాయితీ అధికారి షర్ఫుద్దీన్‌లతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలకు భవనం నిర్మించాలి

సిరిసిల్ల జేఎన్‌టీయూ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ అగ్రహారం డీగ్రీకళాశాలలో ప్రస్తుతం జేఎన్‌టీయూ కళాశాలను కొనసాగుతుందని దీంతో డీగ్రీ విద్యార్థులతో పాటు జేఎన్‌టీయూ విద్యార్థులు చదువుకునేందుకు గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డీగ్రీ చదువుకునే విద్యార్థులకు తరగతి గదులతో పాటు ల్యాబ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం జేఎన్‌టీయూ కళాశాలను తరలించడంతో పాటు భవనాన్ని నిర్మించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంజన, జిల్లా కమిటి సభ్యులు శివ, నివాస్, కార్తీక్, మహేష్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కందికట్కూర్ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలి

ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని గ్రామస్థులు సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో 85 మంది విద్యార్థులు చదువుతున్నారని ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఒక్క ఉపాధ్యాయుడు ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారన్నారు. కలెక్టర్ స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బత్తిని కావ్య, సభ్యులు గుగ్గిళ్ల రవళి, నక్క కాంతవ్వ, తంగళ్లపల్లి గౌతమి, నార్ల పద్మ, బత్తుల రమ, పైడి నిర్మల, రాచకొండ అన్నపూర్ణ, అంగూరి సదాలక్ష్మీ, జక్కుల లత, టేకు రేణుక, కంకణాల లాస్య, ఉరడి రజిత, గౌరవేణి జ్యోతి, హరిత, దేవరకొండ సత్యలక్ష్మీ, కామారం సదాలక్ష్మీ, భూమల్ల అనిల్‌కుమార్, ముత్యం శ్రీనివాస్, సింగరవేణి వెంకటేశం, బిగుళ్ల అశోక్, తాళ్లపల్లి కిషన్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి

- పండుగ అంజనేయులు,వల్లంపట్ల

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన నాకు అమ్మనాన్నాలు చనిపోవడంతో ఓంటరిగా అద్దెకు ఉంటూ జీవిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరుచేయగా అజాబితాలో నాకు 49వ సిరియల్ నెంబర్‌లో నాపేరు ఉంది కానీ నాకు మంజూరు కాగితాలు ఇవ్వలేదు. జిల్లాకలెక్టర్ స్పందించి ఇళ్ల మంజూరు చేసి అందించాలి.

రగుడులో వీధిదీపాలను ఏర్పాటు చేయండి

- దొంతుల చంద్రం, రగుడు, సిరిసిల్ల

సిరిసిల్ల మున్సిపాల్టీ పరిధిలోని 1వవార్డు రగుడులో వీధి దీపాలు లేక ప్రజలందరు ఇబ్బందులు పడుతున్నారని దీనిపై మున్సిపాల్టీకి అధికారులకు సమాచారం ఇచ్చిన ఎవరు పట్టించుకోవడం లేదు. గత మూడ నెలల నుంచి వీధిదీపాలులేకపోవడంతో గ్రామంమొత్తం చిమ్మని చీకట్లోనే ఉండడంతో నడించేందకుగ్రామస్థులు ఇబ్బందులుపడుతున్నారని జిల్లాకలెక్టర్ స్పందించి వీధిదీపాలను వేయించాలి.

గ్రామల్లో రెవె'న్యూ' వ్యవస్థ

(5వ పేజీ తరువాయి)

పరిష్కారం వేగవంతంగా జరగకపోవడంతో ప్రభుత్వం రెవెన్యూ క్లస్టర్‌లను ఏర్పాటు చేసి గ్రామపాలన అధికారులుగా నియమించారు. ఇందుకోసం వీఆర్ఏ, వీఆర్వోల విద్యార్హత ఆధారంగా రాతపరీక్ష నిర్వహించి ఎంపికైన వారికి విధులు అప్పగించారు.

జీపీవోల బాధ్యతలివే..

జిల్లాలో 260 రెవెన్యూ క్లస్టర్లలో మళ్లీ గ్రామ పరిపాలన అధికార వ్యవస్థ మొదలైంది. గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ రద్దు చేసిన తర్వాత భూవివాదాల పరిష్కారం జఠిలంగా మారింది. చిన్న విషయానికి కూడా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ లేదా కలెక్టర్ వద్దకు వెళ్లాల్సి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అప్పిలేట్ అథారిటీగా ఉన్న ఆర్డీవో, జేసీ కోర్టులు కూడా లేకపోవడంతో కలెక్టర్ లేదా కోర్టుకు వెళ్లడమే అన్నట్లుగా మారింది. జీపీవోల నియామకం తర్వాత ప్రభుత్వం వారికి మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో ఉన్న వీఆర్వో వీఆర్ఏ విధులతో పాటు భూభారతి రెవెన్యూ సమస్యల పరిష్కారంలో కీలకంగా పనిచేయాల్సి ఉంటుంది. గ్రామస్థాయిలో అన్ని ధ్రువీకరణ పత్రాల జారీలో విచారణ నిర్వహించనున్నారు. విద్యార్హత. నివాసం. కులం. ధ్రువీకరణ పత్రాల జారీకి విచారణలు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, చెట్ల పరిరక్షణ, భూముల సర్వే, కొలతలకు సహాయకులుగా వ్యవహరిస్తారు. సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించడం, గ్రామస్థాయిలో శాఖల మధ్య సమన్వయకర్తలుగా కూడా వ్యవహరిస్తారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం భూక్యతండాలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గుగులోతు హీర్యా కుటుంబాన్ని సీఐటీయూ, హమాలీ సంఘం ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండల నాయకులు సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేశం, లింబయ్య, మదన్, రాజు, కాంతయ్య, గోవింద్, బాలు, మదన్‌నాయక్, తులసిరాం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శివకేశవుల ఆలయ కమిటీ చైర్మన్‌గా శరయ్య

ముస్తాబాద్, సెప్టెంబర్ 08 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ పట్టణ శివకేశవుల ఆలయ కమిటీ చైర్మన్‌గా మిరుదొడ్డి శరయ్య ఎన్నికయ్యారు. బద్దిపడిడె ప్రతాప్‌రెడ్డి(కాంగ్రెస్), మిరుదొడ్డి శరయ్య (బీఆర్ఎస్) కంచం నర్సింలు(బీఆర్ఎస్) , జాల భిక్షపతి (బీఆర్ఎస్), ఏదునూరి రాంచంద్రం(బీఆర్ఎస్)లు ఆలయ కమిటీ చైర్మన్ కావాలనే ఆశావాహం వ్యక్తం చేస్తూ తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మిరుదొడ్డి శరయ్య ఆలయ కమిటీ చైర్మన్‌గా నియామకమయ్యారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, కోశాధికారిగా ఆగుళ్ల రాజేశం, డైరెక్టర్లును నియమించారు.

ఓటరు జాబితాపై నాయకులతో సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్తయ్య



ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై పలు రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవో సత్తయ్య సోమవారం సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా, కేంద్రాల వివరాలను వెల్లడించారు. అభిప్రాయాలను సేకరించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ మండల శాఖ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, కృష్ణహరి, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి ఎంపీటీసీ పరిధిలో ఓటర్లు అధికంగా ఉన్నారని మరొక ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎంపీడీవో లక్ష్మీనారయణకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. బద్దనపల్లి ఎంపీటీసీ స్థానంలో పద్మనగర్, ఇందిరమ్మకాలనీ, కేసీఆర్‌నగర్ కాలనీల ఓట్లు చేర్చారని దీంతో జిల్లాలోని అత్యధికంగా ఓట్లు ఉన్న ఎంపీటీసీ స్థానంగా మారిందని పేర్కొన్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. 5వేల ఓట్లకు ఒక ఎంపీటీసీ స్థానం ఉండాలనే నిబంధన ఉందని నిబంధనలకు విరుద్ధంగా బద్దనపల్లి ఎంపీటీసీ పరిధిలో 5600 ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మరో ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని లేదా ఇందిరమ్మకాలనీ, కేసీఆర్‌నగర్‌కాలనీ ఓట్లను తొలగించి న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జల్లం ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ నాయకులు సోమ నాగరాజు, ఎగుర్ల ప్రశాంత్, సిలివేరి నర్సయ్య, గుగ్గిళ్ల ఆంజయ్య, కందూకూరి రామగౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను లక్ష్య సాధన దిశగా నడిపించాలి



నిజామాబాద్‌లో ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానం పొందిన చందుర్తి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

చందుర్తి, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను లక్ష్య సాధన దిశగా నడిపించే బాధ్యత ఉపాధ్యాయులదేనని చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిలు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాధాలు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనది అన్నారు. అనంతరం చందుర్తి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 21 మంది ఉపాధ్యా యులను సన్మానించి, ప్రశంసాపత్రాలు, జాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఓరుగంటి వినయ్ కుమార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లచ్చిరెడ్డి, మల్లేశం, సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎడ్ల కిషన్, తాటికొండ సంజీవ్, కట్కూరి ముఖేష్, ప్యారం లక్ష్మీనారాయణ, పుప్పల శ్రీనివాస్ చారి, జువ్వాడి అనిల్ రావు, నరేష్, కృష్ణారెడ్డి, లక్ష్మణ్ ఉన్నారు.

- చందుర్తి: మండలంలోని ఎనగల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్రం కృష్ణారెడ్డి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక పట్ల గ్రామస్థులు సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు లాండె తిరుపతి. డిటిఎఫ్ జిల్లా శాఖ నాయకులు తిరుపతి తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- కోనరావుపేట, ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ సేవలు అందిస్తే వారికి ఫలితం లభిస్తుందని కోనరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్ అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కాశిపాక తిరుపతి ఉత్తమ అవార్డు అందుకోగా ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం కిరణ్మయి, ఉపాధ్యాయులు ప్రభాకర్ ఉన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం



కందికట్కూర్ గ్రామంలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు



గర్జనపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత ద్వారానే అభివృద్ధి సాధ్యం అవుతుందని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలో ప్రపంచ అక్షరాస్యాత దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబయ్య, మల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్, శంకరయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

- ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాలతో పాటు నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, బండలింగంపల్లి, దుమాల, వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్, గర్జనపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గ్రామ పురవీధుల గుండా అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ తీశారు. నారాయణపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూంటు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో 'నా పుస్తకం.. నా కథ' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు కథలను రాశారు. పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరుపై హర్షం



సీఎం రేవంత్‌రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

రుద్రంగి, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రం నుంచి కుక్కలగండి తండా వరకు రూ. 4 కోట్ల 57 లక్షల బీటీ రోడ్డు మంజూరు కావడంతో తండా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో రుద్రంగి మండల కేంద్రంలో సూమారు 200 మందితో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్ పిడుగు లచ్చిరెడ్డి, గుగ్గిళ్ల వేంకటేశం ఎర్రం ఆరవింద్, దాసు, దయ్యాల శ్రీనివాస్, గండి ఆశోక్, వడ్ల నారాయణ, అక్కనపల్లి శ్రీనివాస్, సూర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టాలి



డిపో ఎదుట ధర్నా చేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోకు చెందిన ఖాళీ స్థలంలో అభివృద్ధి జరగక పోతే ఇళ్లు లేని నిరుపేదలకు గుడిసెలు వేయిస్తామని జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. సోమవారం సిరిసిల్ల ఆర్టీసీ డిపోకు చెందిన ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాలని, కొత్త బస్టాండ్‌కు ప్రతి బస్సు వచ్చి వెళ్లాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ డిపో ఎదుట కొత్త బస్టాండ్ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానికులు ధర్నా చేపట్టారు. అనంతరం డిపో మేనేజర్ ఏ ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడారు. డిపో స్థలం కబ్జాకు గురవుతోందని, పిచ్చిమొక్కలు మొలిచి డంపింగ్ యార్డులా మారి దుర్వాసనతో స్థానిక ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, కమిటి సభ్యులు నంది శంకర్, మోర రవి, మోతిలాల్‌నాయక్, జగ్గాని మల్లేశం, కూరపాటి శ్రీశైలం, కొత్త బస్టాండ్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.